

వణికిస్తున్న చలి

● జిల్లాలో పెరుగుతున్న చలి తీవ్రత ● రామగుండంలో 12డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు..



కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ/పెద్దపల్లి టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామ గుండం పారిశ్రామిక ప్రాంతంలో చలి మళ్లీ వణికిస్తోంది. రెండు రోజుల్లోనే రాత్రిపూట ఉష్ణోగ్రతలు 9డిగ్రీలు పడిపోయాయి. బుధ వారం రాత్రి 12.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. గత నెల చివరి వారంలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 13డిగ్రీలకు పడిపోగా తుఫాన్ ప్రభావంతో మళ్లీ ఉష్ణోగ్రత లు పెరిగాయి. ఒక స్థితిలో రాత్రి పూట కూలర్లు వేసుకునే పరిస్థితి ఏర్ప డింది. కానీ రెండు రోజులుగా తుఫాన్ ప్రభావం తగ్గడంతో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. రెండు రోజుల్లోనే రాత్రిపూట ఉష్ణోగ్రతలు ఏకంగా 9 డిగ్రీలు పడిపోయాయి. సోమవారం రాత్రి 21 డిగ్రీలు నమోదుగా మంగళవారం రాత్రి ఆరు డిగ్రీలు పడిపోయి 15డిగ్రీల ఉష్ణో గ్రత నమోదు అయ్యింది. బుధవారం మరింత తగ్గి 12.4డిగ్రీలు నమోదు అయ్యింది. ఇది సాధారణ ఉష్ణో గ్రతల కంటే 2.8డిగ్రీలు తక్కువ. రాత్రి 7 గంటలు దాటితే జన సంచారం తగ్గి రోడ్లు నిర్మానుశ్యంగా కనిపిస్తున్నాయి. ఉదయం కూడా చలి తీవ్ర ఎక్కువగా ఉం టుంది. ఉదయం 9గంటల దాటినా చలి ప్రభావం తగ్గడం లేదు. ఉదయం షిఫ్టులకు వెళ్లే కార్మికులు ఉన్ని దుస్తులు ధరించి విధు లకు హాజరవుతున్నారు. మున్సిపల్ కార్మికులు తెల్లవారుజామునే చలిలో ఇబ్బందులు ఎదుర్కొంటూ పారి శుధ్య పనులు నిర్వహిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని వాడల్లో చలి మంటలతో ప్రజలు ఉపశమనం పొందుతు న్నారు. గోదావరిఖని చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.



తెల్లవారుజామున చలిమంట కాగుతున్న ప్రజలు

ఇబ్బందులు పడుతున్న రోగులు..

చలి త్రీవత పెరగడంతో ఆస్తమా రోగులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. చలి కాలంలో గుండె వ్యాధులు కూడా సంక్రమించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొం టున్నారు. చాలా మంది ఉదయం పూట వాకింగ్, జాగింగ్ చేసేవారు కూడా చలి ప్రభావంతో సూర్యోదయం వరకు వేచి చూస్తున్నారు. వృద్ధులు చలికి తట్టుకోలేని పరిస్థితి ఏర్పడిం ది. చలిమంటలతో ఉపశమనం పొందుతున్నారు. చిన్న పిల్లలు సైతం చలితో దగ్గు, జలుబు బారిన పడుతున్నారు.

మిగతా 8వ పేజీలో..

న్యూస్ బాక్స్

వేతనం పెంచాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబర్ 12 (ఆంధ్ర జ్యోతి): పారిశుధ్య కార్మికులకు రూ.5వేల వేతనం పెంచాలని మాదిగ మిత్రమండలి అధ్యక్షులు కోటగిరి పాపయ్య అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాను పనంగా పెట్టి పని చేస్తున్నారని, వారికి రూ.5వేల వేతనం పెంచాలని రామ గుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూ ర్ చొరవ తీసుకుని సీఎంరేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదే విధంగా చెపు ్పలు కుట్టే కార్మికులకు టేలా నిర్మాణాలు చేసి ఇవ్వాలని, రామగుండంలో ఆది జాం బవంతుని విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. మాదిగలను జాగృతం చేయడానికి త్వరలో బస్తీబాట నిర్వహించనున్నట్టు చె ప్పారు. విలేకరుల సమావేశంలో సంతోష్, దాసరి ఎల్లయ్య, నర్సయ్య, ఓదెలు, ప్రభు దాస్, హన్మంతు, శంకర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు అభినందనలు

కోల్‌సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో మిస్సింగ్ కేసులను చేధించ డంలో ప్రతిభకనబరిచిన కానిస్టేబుల్ ఐతో జు రమేష్‌ను గురువారం వన్‌టౌన్ పోలీసు లు అభినందిచారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, సీఐ-2 రవీందర్, ఎస్ఐలు భూమేష్, శ్రీని వాస్ తదితరులు అభినందనలు తెలిపారు. అదృశ్యమైన వారిని వెతికిపట్టుకుని కుటుం బ సభ్యులకు అప్పగించడంలో విశేష కృషి చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

ఆటోలపై స్టిక్కర్ల తొలగింపు

కోల్‌సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామగుండం మెయిన్ చౌరస్తాలో ఆటోలపై వేసిన అనవసరపు స్టిక్కర్లను ట్రాఫిక్ పోలీ సులు తొలగించారు. ట్రాఫిక్ ఎస్ఐ హరి శంకర్ ఆధ్వర్యంలో స్టిక్కర్ల తొలగించారు.



రామగుండం మెడికల్ కళాశాల ముఖ ద్వారం

మెడికల్ హబ్‌గా రామగుండం..
- మెడికల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు
- డెంటల్ కళాశాల అనుమతి కోసం ప్రతిపాదనలు

6



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కామన్ డైట్ లాంచ్ కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పౌష్టికాహారం అందించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

8

అల్లర్ల అదుపులో వజ్రది ప్రధాన పాత్ర : సీపీ

కోల్‌సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన అల్లర్లు జరుగుతున్న సమ యంలో అల్లరి మూకలను చెదరగొట్టడంలో వజ్ర ప్రధాన పాత్ర పోషిస్తుందని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నూతన ఏఆర్ కానిస్టేబుళ్లకు కమిషనరేట్ హెడ్‌క్వార్టర్‌లో వజ్ర వాహన పనితీరు గురించి అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ స్వయంగా పని తీరును వివరించారు. స్మోక్, స్టన్ గ్రనైడ్ సెల్స్ ఏవిధంగా ఫైర్ చేయాలనే వివరాలను స్వయంగా ఫైర్ చేసి చూపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లరి మూకలను చెదరగొ ట్టేందుకు ఒకేసారి వజ్ర వాహనం ఏడు సెల్స్‌ను ఉపయోగించి ఫైర్ చేయగలుగు తుందన్నారు. ఈ వాహనానికి చుట్టూ ఇనుక కంచె ఉంటుందని, 12మంది సిబ్బం ది అల్లర్ల సమయంలో ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి : సీపీ



జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న సీపీశ్రీనివాస్

జూలపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ రామగుండం సీపీ శ్రీనివాస్ గురువారం పెద్దపల్లి డిసిపి చేతనతో కలిసి సందర్శిం చారు. పోలీస్‌స్టేషన్‌లోని పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించారు. అనంత రం సీపీ మాట్లాడుతూ జూలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలను అదుపు చేయ డంలోను, శాంతిభద్రతల నిర్వహణలో పోలీసుల పనితీరు అభినందనీయమన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి లాఅండ్ ఆర్డర్, పొలిటికల్ సమస్యలు లేవని, బాధిత ప్రజలతో గౌరవ మర్యాదలతో వ్యవహరించి ప్రజల మన్ననలను పొందేందు కు కృషిచేయాలన్నారు. పోలీసుల విధులు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది సమస్యాత్మక గ్రామాలు, నేరాలకు పాల్పడేవారిని గుర్తించి ముందస్తు చర్యలు చేప ట్టాలన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో తమ పోలీసులు ప్రజలతో కలిసి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వాటి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఇంచార్జి ఎస్ఐ నరేష్‌కుమార్, పలువురు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన శిబిరం

కమాన్‌పూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలన శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీబీ సీనియర్ సూపర్‌వైజర్ పి. వరలక్ష్మీ మాట్లాడుతూ వంద రోజుల్లో క్షయ వ్యాధి నిర్మూలన చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించామని, వారికి మందులను ఇవ్వను న్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తల తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సల్మాబేగం, ల్యాబ్ టెక్నిషియన్ శార ద, ఏఎన్‌ఎంలు బాలభారతి, శ్రీలతలు ఉన్నారు.

హైవే భూముల్లో రైతులు పంట సాగు చేయొద్దు..

ముత్తారం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓడెడు, ముత్తారం, కేశనపల్లి, అడవిశ్రీరాంపూర్, మైదంబండ, సర్వారం,పోతారం, లక్కారం గ్రామాలలో నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులు ఈ సీజన్‌లో పంటను సాగు చేయవద్దని మండల వ్యవసాయ అధికారి అనూష తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతాయి కాబట్టి ఆయా గ్రామాల రహదారి నిర్మాణం కోసం ఎన్నుకున్న భూముల రైతులు ఈ పంట కాలం నుంచి వారివారి భూముల్లో ఎటు వంటి పంటలను వేయకూడదు అని నోటీసులు జారీ చేశారు.

ఇలా ఇచ్చారు.. అలా తీసుకున్నారు..

- ఇటీవల నాలుగు 108 అంబులెన్స్‌ల కేటాయింపు.. - ప్రభుత్వ ఆదేశాలతో మూడు వెనక్కివెళ్లిన వైనం..



జిల్లాకు కేటాయించిన 108 అంబులెన్సులు



అంతర్గాంలో మిగిలిపోయిన అంబులెన్స్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మండలానికి ఒక అంబులెన్స్ ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. జిల్లాకు కూడా అత్యవసర వైద్య సేవల్లో వినియోగించుకునేందుకు మరో నాలుగు అం బులెన్స్‌లు కేటాయించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి మొత్తం 136 వాహనా లను ప్రారంభించి ఆయా జిల్లాలకు అంబులె న్స్‌లను పంపించారు. జిల్లాకు వచ్చిన నాలు గు అంబులెన్స్‌లను సీఎం కాన్వాయ్‌లో విని యోగించిన మరుసటి రోజే ప్రభుత్వ ఆదేశా లతో జీవీకేఈఎమ్మార్‌ఐకి తరలించారు. జి ల్లాలో మొత్తం ఇప్పటి వరకు 8అంబులెన్స్‌లు సేవలందిస్తున్నాయి. పెద్దపల్లి, సుల్తానాబాద్, బసంత్‌నగర్, గోదావరిఖని, కమాన్‌పూర్, ఓదె ల, ధర్మారం, మంథిని మండలాల్లో అంబులె న్స్‌లు ఉన్నాయి. వీటికి తోడు నూతనంగా జూలపల్లి, అంతర్గాం, కాల్వశ్రీరాంపూర్, మ ుత్తారం మండలాలకు 108 అంబులెన్స్‌లను కేటాయించి ఈనెల 2న హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఒక్కో 108 అంబులెన్స్‌లో వైద్య సేవలందించేందుకు 12 గంటల డ్యూటీ చొప్పున ఇద్దరు పైలెట్లు, ఇద్దరు మెడికల్ టెక్నీ షియన్స్ అందుబాటులో ఉంటారు. అయితే రెండుమూడు రోజుల క్రితం జూలపల్లి, ము త్తారం, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు కేటా యించిన అంబులెన్స్‌లను ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాలతో తిరిగి సిద్దిపేటకు రెండు, మెదక్ ఒకటి తరలించారు. దీంతో జిల్లాలో కేవలం అంతర్గాం మండలానికి ఒక అంబులెన్స్ మిగిలిపోయింది. గతంలో ఏడు అంబులెన్స్ ఉండగా గిఫ్ట్ ఏ స్మైల్ కింద అప్ప టి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అంబులెన్స్ కొనిచ్చారు. దీంతో జిల్లాలో అంబులెన్స్‌ల సం ఖ్య ఎనిమిదికి చేరింది. ఇటీవల హైదరాబాద్ కు తరలించగా మిగిలిన అంబులెన్స్‌తో మొ త్తం 9 అంబులెన్స్‌లు సేవల్లో ఉన్నాయి. ఇదే కాకుండా నవజాత శిశువులకు ఆరోగ్య సమ స్యలు తలెత్తితే వెంటనే తరలించేందుకు నియోనాటల్ వెంటిలేటర్ అంబులెన్స్ అందు బాటులో ఉంది. అంబులెన్స్‌ల కొరత ఉండ డం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సరిపడా అంబులెన్స్‌లు లేకపోవడంతో సకాలంలో రోగులను చేర్చలేని పరిస్థితి నెలకొంది. తిరిగి పంపించిన అంబు లెన్స్‌లను తీసుకురావడంతో పాటు ప్రతి మం డలానికి ఒక అంబులెన్స్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరో 70 వాహనాలను ప్రభుత్వం కేటాయించనుంది..

- కుమారస్వామి, జిల్లా సూపర్‌వైజర్

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అంబులెన్స్‌లు వెనక్కి పంపించాం. రానున్న రోజుల్లో ప్రభు త్వం మరో 70 వాహనాలు కేటాయించనుంది. అందువలన నుంచి తరలివెళ్లిన వాహనాల స్థానాల్లో మళ్లీ కేటాయించనున్నారు.

గ్రూప్2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పెద్దపల్లి, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పక్కాగా గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించాలని పరీక్షల జిల్లా నోడల్‌అధికారి జే.అరుణశ్రీ అధి కారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి గ్రూప్ 2 పరీక్షా ఏర్పాట్లపై జే.అరుణ శ్రీ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 15,16 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం3 గంటల నుంచి 5.30వరకు రెండు సెషన్‌లలో గ్రూప్2 పరీక్షలు సజావుగా జరిపేందుకు ఏర్పాట్లు పక్కాగా జరగాలని సూచించారు. జిల్లాలో 9 వేల 18 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యేందుకు వీలుగా మొత్తం 18 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశామనిన్నారు. కలెక్టరేట్‌లోని ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రశ్న పత్రాల స్టోరేజ్‌గా పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలో పరీక్షల సక్రమంగా నిర్వహించేందుకు 18పరీక్ష కేంద్రాలకు రీజనల్ కోఆర్డినేటర్‌గా లక్ష్మీనర్సయ్యను నియమించడం జరిగిందన్నారు. ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు వీలుగా నాయబ్ తహసీ ల్దార్‌లను జాయింట్ రూట్ అధికారులుగా, పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు తహసీల్దారులను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులుగా నియ మించామన్నారు. ప్రశ్నపత్రాల భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్ వద్ద అవసర మైన జాగ్రత్తలు పాటించాలన్నారు. డిసెంబర్ 14న పరీక్షల నిర్వహణ పై పరీక్ష కేంద్రాల వారిగా చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్‌లు సమావేశాలు నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఒక రోజు ముందు పరీక్ష కేంద్రం పరిసరాలను చీఫ్ ఇన్విజిలేటర్ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రం కాంపౌండ్ వాల్ దగ్గర కిటికీలు, చెట్లు ఏవైనా ఉన్నాయా పరిశీలించాలని, ఎట్టి పరిస్థితులలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండకుండా పటిష్ట చర్యలు చేప ట్టాలని సూచించారు. అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంట లకు మూసివేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు అనుమతించమ ని, ఈ అంశాన్ని అభ్యర్థులకు చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చే సమయంలో చెక్ చేసేందుకు అవసరమైన స్టాఫ్ ఏర్పాటు చేయాలని, మహిళా అభ్యర్థుల ను చెక్ చేసేందుకు ప్రైవసీ ఉండేవిధంగా ఏర్పాటు చేయాలని, అభ్యర్థు లను చెక్ చేసే సిబ్బందికి శిక్షణ అందించాలని పేర్కొన్నారు. పరీక్షా కేం ద్రంలో హాల్ నంబర్లకు మార్గం తెలిసేలా డైరెక్షన్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ప్రతాప్, రీజ నల్ కోఆర్డినేటర్ లక్ష్మీనరసయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ప్రకాష్, అబ్జర్వర్లు ఫ్లయింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు, అధికారులు

31లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, వేణు

పెద్దపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ ఈనెల 31లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు జే. అరుణశ్రీ, డి.వేణులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దర ఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ సర్వే ప్రక్రియ ఈనెల 31 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదే శించారు. ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, తహసీల్దార్‌లు, మండల ప్రత్యేక అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించుకుని సర్వే చేపట్టాలని, ప్రతి గ్రామానికి/మున్సిపల్ వార్డుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి, ఆయన ద్వారా ఇందిరమ్మ యాప్‌లో లాగిన్ అయ్యి వివరాలను పక్కగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సర్వే జరిగే సమయంలో ప్రజలు అందు బాటులో ఉండే విధంగా షెడ్యూల్ గురించి ముందుగానే సమాచారం అందిం చాలని అన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేసేందుకు అవసర మైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలపై సమీక్ష

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధి కారి డాక్టర్ అన్నా ప్రసన్న కుమారి గురువారం తన కార్యాలయంలో శిశు మరణాల సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ 2024 నుంచి నవంబర్ వరకు శిశు మరణాలు 35 నమోదు కాగా, వాటిలో 6 శిశు మరణాల కేసులను ఎంపిక చేసి వాటి పైన సమీక్ష నిర్వహించామన్నారు. వీటిలో నెలలు నిండకుండా పుట్టిన పిల్ల లు, బరువు తక్కువగా పుట్టిన పిల్లలు, జ్వరం వచ్చి ఫిట్స్‌తో చనిపోయిన పిల్ల లు, ఉమ్మనీరు మింగడం వలన చనిపోయిన పిల్లలు, కొందరు పాలు పట్టిన తరువాత తల్లి సరిగా భుజం పైన వేసుకొని శిశువును చేతితో తట్టక పోవడం వల్లన పొలిమారి పాలు శ్వాస నాళంలోకి పోవడం వలన చనిపో యారని వివరించారు. భవిష్యత్తులో జిల్లాలో పిల్లల మరణాలు తగ్గాలని వైద్యులు, సం బంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్లు బి. కిరణ్ కు మార్, శ్రీధర్, రవీందర్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చని ప్రభుత్వం

- బీజేపీ రామగుండం ఇన్‌చార్జి సంధ్యారాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖని, డిసెంబరు 12: ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నెరవేర్చలే దని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేరుగు హన్మంత్ గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలపై బుధ వారం బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మోటార్‌సైకిల్ ర్యాలీ చేస్తుంటే స్థాని క పోలీసులు శాంతియుత ర్యాలీని విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నారని, కేసులు పెడతామని భయపెట్టారని వారు ఆరోపించారు. గతంలో మహిళా కార్పొరేటర్లపై కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించడం బాధాకరమని, స్థా నిక పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేయ నున్నట్టు చెప్పారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. రాబోయే కాలంలో బీజేపీ అధికారంలోకి వస్తే పోలీసులు ఎక్కడ ఉంటారని, ఒకే పార్టీకి కొమ్ముకాయడం సరికాదన్నారు. విలేకరుల సమావేశంలో పిడుగు కృష్ణ, జక్కుల నరహరి, కోడూరి రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మేరుగు సతీష్

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షు డు మేరుగు సతీష్ డిమాండ్ చేశారు. తమను క్రమబద్ధీకరించాలనే ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగం గా జిల్లా కేంద్రంలోని ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగ నియామకం సందర్భంలో వారికి ఎగ్జామ్స్ నిర్వహించి మెరిట్ ఆధారంగానే ఉద్యోగ అవకాశం కల్పించారని, అలాంటప్పుడు వారిని క్రమబద్ధీకరించడం వలన ఎలాంటి న్యాయపరమైన సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉండదని అన్నారు. ఎస్టీయూటీఎస్ జిల్లా శాఖ పక్షాన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు పూర్తి సంఘీభావం ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో జాక్ జిల్లా అధ్యక్షులు తిప్పని తిరుపతి, కుంభాల సుధాకర్, వెంకటేషం, శ్రావణ్, సంపత్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మన్నపల్లి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొద్దుటూరి సంజీవరెడ్డి, సరోజన, శ్రీలత కారులో పట్టణంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి కరీంనగర్ వైపు వెళ్తున్న క్రమంలో తుమ్మన్నపల్లి వద్ద కారుకు ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో శ్రీలతకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

కొడిమ్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి అనే వ్యక్తిని గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. చెప్యాల నుంచి నల్లగొండ వైపు వాకింగ్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. లచ్చిరెడ్డిని 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పాపయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధి లోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీకి చెందిన కడమంచి పాపయ్య (54)అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపయ్య ఇటీవల తన సైకిల్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతానికి వచ్చి ఇంటికి తిరిగి వెళుతున్నాడు. వెనుక వైపు నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన అతన్ని మొదట సిరిసిల్లకు తరలించారు. మెరుగైన చికిత్స పొందిన పాపయ్య స్వల్పంగా కోలుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కూలీ పనులతో పాటు పాములను పట్టి బతుకు వెళ్లదీసేవాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పాపయ్యకు భార్య, కొడుకు ఉన్నారు.

పురుగుల మందు తాగిన ఒకరి మృతి

మానకొండూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన బనుక రవి (46) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవితో పాటు అతడి ఇద్దరు అన్నలు ఓదెలు, పర్వతాలు మధ్య కొంత కాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ నెల 9న వివాదం ముదరడంతో వారి వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. రవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

హాల్‌టికెట్ తీసుకొని వస్తుండగా రోడ్డు ప్రమాదం

- చికిత్స పొందుతూ వివాహిత మృతి
- మృతురాలికి 10 నెలల కూతురు


పూజిత(ఫైల్)

ఇల్లంతకుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షలు రాయడానికి కరీంనగర్‌లో హాల్‌టికెట్ తీసుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆకారపు పూజిత (23) అనే వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన పూజితకు సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆకారపు అజయ్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 నెలల కూతురు శ్రేష్ఠ ఉంది. పూజిత కరీంనగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వారం రోజుల క్రితం నారెడ్డిపల్లె గ్రామానికి వచ్చిన పూజిత డిగ్రీ హాల్‌టికెట్ తీసుకోవడానికి బుధవారం కరీంనగర్‌కు ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు వెళ్లారు. ఇంటికి వస్తుండగా పొత్తూరు గ్రామసమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పూజితకు తీవ్ర గాయాలయ్యాయి. భర్త అజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పూజిత మృతిచెందింది. భర్త అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. పూజిత అంత్యక్రియలు లింగారెడ్డిపల్లె గ్రామంలో నిర్వహిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సముద్రాల కనకయ్య(67) రిటైర్డు సింగరేణి ఉద్యోగి. ఇంటి పనుల నిమిత్తం షాపుకు వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో హుజూరాబాద్ వైపు వెళ్తున్న సిలిండర్ల లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో తలకు, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే గ్రామస్థులు మాజీ సర్పంచ్‌కు విషయం తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకొని సొంత కారులో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కనకయ్య కుమారుడు సముద్రాల కిషోర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్‌కు చెందిన పల్లె నిశాంత్ కుమార్ బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందినట్లు టౌన్ ఎస్సై మన్మధరావు తెలిపారు. పట్టణంలోని బీట్ బజార్‌కు చెందిన మృతుడు బుదవారం రాత్రి సేహితుని వివాహ వేడుకల్లో పాల్గొని స్కూటీపై ఇంటికి వస్తుండగా బీట్ బజార్ వద్ద స్విఫ్ట్‌డిజైర్ కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వర్క్‌ఫ్రం హోం పేరుతో మోసం

- జగిత్యాల యువకుడికి రెండు లక్షలు టోకరా

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం అని ఆశ పడి వాట్సాప్ లింక్ ఓపెన్ చేసిన జగిత్యాల యువకుడు 2 లక్షల 9 వేల రూపాయు పోగొట్టుకుని గురువారం పోలీసులను ఆశ్రయించాడు. జగిత్యాల పట్టణంలోని ఉస్మాన్ పురకు చెందిన ఇర్ఫాన్‌ఖాన్ అనే యువకుడికి అక్టోబర్ 21వ తేదీన వాట్సాప్‌లో వర్క్ ఫ్రం పేరుతో వాట్సాప్‌లో లింక్‌వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా వారు డబ్బులు చెల్లించమని చెప్పడంతో పలు దఫాలుగా 2 లక్షల 9 వేల రూపాయలను చెల్లించగా ఉద్యోగం ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మన్మధరావు తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధులకు గాయాలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేటలో గురువారం కోతులు దాడిచేసి వృద్ధులను గాయపరిచాయి. గ్రామానికి చెందిన రామిడి మాధవరెడ్డి, కలువల సరో జన ఇళ్ల ముందు కూర్చొని ఉండగా కోతులు కాళ్లను, చేతులను తీవ్రంగా గాయపరిచాయి. మెరుగైన వైద్యంకోసం వారిని కాల్వశ్రీరాం పూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కోతులు మందలుగా గ్రామంలో వీధులవెంట విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, కోతులను చూసి పిల్లలు భయపడి ఇంట్లోకి పరుగులు తీస్తున్నారని, వృద్ధులు అక్కడే కూర్చొని ఉండగా మీదపడి గాయపరుస్తున్నాయని, ప్రభుత్వం కోతుల నివారణకు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మెడికల్ హబ్‌గా రామగుండం



సింగరేణి మెడికల్ కళాశాల

- మెడికల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు
- డెంటల్ కళాశాల అనుమతి కోసం ప్రతిపాదనలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం మెడికల్ హబ్‌గా మారుతోంది. ఇప్పటికే మెడికల్ కళాశాల ప్రారంభం కాగా, దానికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల ఈ ఏడాదిలో మంజూరైంది. ఈనెల 2న 60సీట్లతో నర్సింగ్ కళాశాలను ప్రారంభం కాగా, 30సీట్లతో పారా మెడికల్ కళాశాల ప్రారంభమైంది. అలాగే రామగుండంలో డెంటల్ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రతిపాదన పంపగా, త్వరలోనే ఆమోదం లభించే అవకాశాలున్నాయి. ఇందుకోసం స్థల సేకరణ కూడా ప్రారంభమైంది.

మెడికల్ కళాశాలలో 450 మంది విద్యార్థులు..

సింగరేణి మెడికల్ కళాశాలను 150సీట్లతో 2022లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. కాలేజీలో 450మంది విద్యార్థులు ఉండగా, 7శాతం సింగరేణి కార్మికుల ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు. ఇటీవల రూ.26కోట్లతో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో 58మంది విద్యార్థులు చేరారు. అదే విధంగా 30పారామెడికల్ సీట్లను కూడా భర్తీ చేశారు.

'సిమ్స్'కు అనుబంధంగా డెంటల్ కళాశాల..

సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)కు అనుబంధంగా డెంటల్ కళాశాల ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రతిపాదనలు పంపారు. ఆయన సానుకూలంగా స్పందించి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నివే దికను ఎన్‌ఎంయూకు పంపారు. 100సీట్లతో రామగుండంలో బీడీఎస్ కళాశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాశారు. త్వరలోనే డెంటల్ కళాశాల వచ్చే అవకాశం ఉంది. అలాగే సిమ్స్‌కు అనుబంధంగా గోదా వరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 140 కోట్లతో ఐదు అంతస్తుల 720 పడకల సామర్థ్యం గల భవన నిర్మాణం చేపట్టారు. 2025 ఆగస్టుకల్లా పనులు పూర్తి కావాలని మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అధికారు లను ఆదేశించారు. రూ.16 కోట్లతో ఐసీ భవనం, టీబీ సెంటర్‌ను కూడా ఏర్పా టు చేయాలని, ఈ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఐదు అంతస్థుల భవనం పూర్తయితే మెడికల్ కళాశాల విద్యార్థులకు, రామగుండం ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందనున్నది.


నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్థుల భవనం

పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి..

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



రామగుండానికి పూర్వ వైభవం తీసుకురావడానికి మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను తీసుకు వచ్చాం. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మూడు 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్లు, రూ.520 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.140కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రూ.150కోట్లతో ఇంటి గ్రేడెట్ స్కూళ్లు, రూ.26కోట్లతో నర్సింగ్ కళాశాల, త్వరలో డెంటల్ కళాశాల ఏర్పాటు చేసి మెడికల్ హబ్‌గా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం.


నిర్మాణంలో ఉన్న ఐసీయూ కేంద్రం

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఖాన్‌పుర ప్రాంతంలో బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడులో 403 గ్రాముల గంజాయి పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యం లో తనిఖీలు నిర్వహించగా ఖాన్‌పుర ప్రాంతానికి చెందిన ఎండీ రహీం, సయీద్ సోయబ్ అక్తర్‌ల వద్ద గంజాయి పటు బడిందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయితో పాటు 2 మొబైల్‌ఫోన్‌లను సీజ్ చేశామని సీఐ తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ పులి నగేష్‌గౌడ్, కానిస్టేబుళ్లు కుమార్ యా దవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

చొప్పదండి: మండలంలోని రేవెల్లి గ్రామంలో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులు గుడుంబాను పట్టుకున్నారు. ఎస్సై విజయభాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది కుంటాల అంజయ్య వద్ద రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గుడుంబా తయారు చేసినా తరలించినా చర్యలుతీసుకుంటాయని సీఐ హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో ముల్కల నరేశ్(32) అనే యువకుడు బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావపల్లి గ్రామానికి చెందిన నరేశ్ సెంట్రింగ్ కూలీగా పనిచేసేందుకు సిరిసిల్ల పట్టణానికి రెండేళ్ల క్రితం వలసవచ్చాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడికి దూరంగా భార్య ఉంటుంది. దీంతో నాలుగు నెలల క్రితం మరో మహిళను పెళ్లిచేసుకున్నాడు. ఏడాది క్రితం తల్లి అనారోగ్యం పాలుకావడంతో చికిత్స కోసం అప్పులు అయ్యాయి. ఈ అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని తల్లి లచ్చవ్వ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ఆటంకం

- తుర్తి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్య - ఉన్నతాధికారులకు సమస్య వివరించిన సిబ్బంది


సర్వే నిలిచిపోయిన తుర్తి గ్రామం

కథలాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవుల్లో విసిరేసినట్టు ఉన్న మండలంలోని తుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగడం లేదు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో మూడు రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్‌లో యాప్ ద్వారా ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. తుర్తిలో అందుకు భిన్నంగా నేటికీ సర్వే ప్రారంభం కాలేదు. ప్రజాపాలనలో ఇక్కడ 236 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించడానికి ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. బీమారం, కొడిమ్యాల, రుద్రంగి, చందుర్తి మండలాల సరిహ ద్దుల్లో అటవీ ప్రాంతంలో ఉన్న తుర్తిలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన టవర్ మాత్రమే ఉంది. ఈ టవర్ రెండు సంవత్సరాలుగా పనిచేయడం లేదు. దీంతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో అంబారిపేట నుంచి టీవీల కేబుల్ ద్వారా కొందరు వినియో గదారులు బూస్టర్ ఏర్పాటు చేసుకుని సేవలు పొందుతున్నారు. ఈ సేవలు కొందరికి మాత్రమే పరిమితం కాగా సక్రమంగా పనిచేయడం లేదు. పంచాయతీ కార్యదర్శి తన యాప్‌లో సర్వే వివరాలు నమోదు చేసుకోడానికి ముందు లాగిన్ కావాల్సి ఉంటుంది. అప్పుడు మొబైల్‌కు వచ్చే ఓటీపీ ఎంట్రీ చేస్తేనే సర్వే మొదలు పెట్టడానికి అవకాశం ఉంటుంది. అక్కడ ఏ ఇతర నెట్‌వర్క్‌లు లేకపోవ డంతో సర్వేకు పూర్తిగా ఆటంకం ఏర్పడింది. ఈ నెల 20వ తేదీలోపు సర్వే పూర్తి చే యాలని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో నెట్‌వర్క్ లేకపోవడంతో సమ స్యగా మారింది. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి గురువారం ఎంపీడీవోకు వివరించారు. 'ఆంధ్రజ్యోతి' ఎంపీడీవో శంకర్‌ను దీనిపై వివరణగా కోరగా నెట్‌వర్క్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

యువకుడి వేధింపులు.. యువతి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ గ్రామంలో యువకుడి వేధింపులు భరించలేక ఓ యువతి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టింది. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో మండలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సిరిసిల్ల న్యాయమూర్తికి సమాచారం అందించడంతో ఆసుపత్రికి చేరుకుని బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి అదే గ్రామంలోని ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. సదరు యువకుడు తరుచూ ఆమెను సెల్‌ఫోనులో వేధించేవాడు. తట్టుకోలేని యువతి గురువారం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఓ ఆసుపత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు యత్నించడంతో యువకుడు పారిపోయాడు. స్థానిక పోలీసులు ఘటనపై వివరాలను సేకరిస్తున్నారని తెలిసింది.

బంగారు ఆభరణాలు బాధితురాలికి అప్పగింత


ఆభరణాలను అప్పగిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ హ్యాండ్‌బ్యాగ్‌లో 10 తులాల బంగారు ఆభరణాలు మరిచిపోయిన బాధితురాలికి పోలీసులు గురువారం ఆభరణాలను అప్పగించారు. కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మన గ్రామానికి చెందిన మామిడిపల్లి హేమశ్రీ(25) తన భర్త గణేష్‌తో కలిసి బుధవారం కరీంనగర్‌లో ఒక పెళ్లి వేడుకకు హాజరైంది. తిరిగి జగిత్యాలకు వెళ్లేందుకు ఫంక్షన్‌హాల్ నుంచి బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణించింది. ఆటో దిగి బస్టాండ్‌లోకి వెళ్ళిన ఆ మహిళ కొద్దిసేపటికి తన బ్యాగును ఆటోలోనే మరిచిపోయినట్లు గ్రహించి వెంటనే ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతికత ఆధారంగా ఆటోను గుర్తించిన పోలీసులు సంబంధిత ఆటో డ్రైవర్ నుంచి బ్యాగును, అందులోని 10 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంగారు ఆభరణాలను గురువారం కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. ఆభరణాలు గుర్తించిన సీఐ బిల్ల కొటేశ్వర్, సిబ్బంది, క్రైమ్‌పార్టీ కానిస్టేబుళ్ళు కుమార్‌లకు పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి రివార్డులు అందజేశారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

- ధ్రువపత్రాలు లేని 54 వాహనాలు సీజ్
- డ్రంకెన్‌డ్రైవ్‌లో 18 మందిపై కేసు


తనిఖీ చేస్తున్న ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో బుధవారం అర్ధరాత్రి ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 54 వాహనాలను సీజ్ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిపై కేసులు నమోదు చేశారు. కరీంనగర్ టౌన్ పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి ఆధ్వర్యంలో టౌన్ ఏసీపీ నరేందర్, మాధవి తనిఖీలను నిర్వహించారు. రాత్రి నగరంలో బ్రీత్ ఎనలైజర్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్‌లతో మద్యం సేవించిన వారిని, అనుమానితులను తనిఖీ చేసి పలువురిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. నార్కోటిక్ డ్రగ్స్ గుర్తించేందుకు శిక్షణ తీసుకున్న జాగిలం లియోతో పలు వాహనాలను, ఆర్టీసీ బస్టాండ్ కార్గో సర్వీస్ సెంటర్‌లోని పార్శిళ్లను, అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో సీఐలు కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోరంటాలలో బ్రిడ్జి శిలాఫలకం ధ్వంసం


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం గోరంటాల వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులకు సంబంధించి, శంకుస్థాపన సమయంలో ఇటీవల ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ: 65 లక్షలతో గత నవంబరు 30న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అబివృద్ధి పనులు ప్రారంబించారు. అందులో భాగంగా వేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం ఉదయం ధ్వంసం చేశారు. దీనిపై కాంగ్రెస్ మండల అద్యక్షుడు హమీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, వెంకటి, ప్రవీణ్, పర్శ రాములు తదితరులు ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్: అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల నాయకులు అన్నారు. గంభీరావుపేట మండలం రైతుల సౌకర్యార్థం గోరంటాల నుంచి రత్నగిరిపల్లెను కలుపుతూ క్యాజ్‌వే నిర్మాణానికి ప్రభుత్వం రూ. 65లక్షలు మంజూరు చేసిందన్నారు. గత నెల క్యాజ్‌వే పనుల ప్రారంభోత్సవం కోసం శిలాఫలకాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారన్నారు. గురువారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆరోపి ంచారు. మూడు రోజుల క్రితం గజసింగవరం రాజేశ్వర్‌రావనగర్ మేయిన్ రోడ్డుకు పక్కన గుర్తు తెలియన వ్యక్తులు బీఆర్ఎస్ గద్దెను కూల్చేస్తే అది కాంగ్రెస్ పార్టీ నాయకులు కూర్చారని బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన గద్దెను, శిలాఫలకం కూల్చిన వారిపై ఎస్పీ విచరణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, ఎల్లారెడ్డిపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమరిశెట్టి తిరుపతి, సీనియర్ నాయకులు పర్శహన్మాండ్లు, పిట్ల వెంకటి, అంజిరెడ్డి, పరశురాములు, ప్రసాద్‌రావు, ప్రవీణ్ , రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోరంటాల వద్ద ధ్వంసమైన శిలాఫలకం

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఉదయం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 13,659 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 12,970 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదో సెమిస్టర్‌లో మొత్తం 11,032 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,599 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఇంటి పైకప్పు కూలి షార్ట్‌సర్క్యూట్ ఒకరి సజీవదహనం


తిరుపతి(ఫైల్)

మల్యాల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటల్లో అక్కడికక్కడే సజీవ దహనం అయ్యాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన గాతం తిరుపతి (37) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి రోజు వారి మాదిరిగానే తిరుపతి తమ పాత ఇంట్లో ఒక్కడే పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి పైకప్పు కూలింది. దీంతో ఇంట్లోని విద్యుత్ తీగలు తెగి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో బయటకు రాలేక తిరుపతి మంటల్లోనే సజీవదహనం అయ్యాడు. చుట్టు పక్కల వాళ్లు గమనించి పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో సీఐ నీలం రవి చేరుకొని సంఘటన స్థలం పరిశీలించగా ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేసింది. అప్పటికే తిరుపతి మృతిచెందడంతో మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పట్టుదలే ఆయుధంగా..

అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో పతకాలు

ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన ఎస్సారార్ విద్యార్థులు


అథ్లెటిక్స్ ట్రాక్స్‌పై మనోజ్, సందీప్

పట్టుదలే ఆయుధంగా అథ్లెటిక్స్‌లో రాణించి ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు ఇద్దరు ఎస్సారార్ కళాశాల విద్యార్థులు. అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ చాటి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. ఆర్మీలో ఫిజికల్ టెస్ట్, రన్నింగ్‌లో ప్రతిభ చూపి రాష్ట్రంలోనే మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఆర్మీలో శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల విద్యార్థులు చింతల సందీప్, ఏ సాయిమనోజ్‌లు చిన్నప్పటి నుంచి ప్రతిభ గల విద్యార్థులుగా పేరు తెచ్చుకున్నారు. సందీప్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామరకుంట మారుమూల గ్రామానికి చెందినవాడు కాగా సాయిమనోజ్‌ది కరీంనగర్. ఎస్సారార్‌లో డిగ్రీ చదువుతుండగా వీరి చూపు అథ్లెటిక్స్ వైపు మళ్లింది. వీరి ఆసక్తిని గమనించిన కోచ్ వరుణ్ కృష్ణన్ అథ్లెటిక్స్‌లో ఓనమాలు నేర్పించారు. ఫలితంగా అనతి కాలంలోనే వీరు జిల్లా, రాష్ట్ర అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటారు.

ఆర్మీలో ఉద్యోగం సంపాదించడమే లక్ష్యమని వారు తమ మనసులోని మాటను కోచ్ వరుణ్‌కృష్ణన్‌కు చెప్పారు. దీంతో వరుణ్‌కృష్ణన్ ఇద్దరు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. దీంతో వీరు 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి, అంతర యూనివర్సిటీ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ చాటి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. అనంతరం 2023 మార్చిలో జరిగిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సందీప్, ఏ సాయిమనోజ్‌లు ఉత్తీర్ణుల య్యారు. అనంతరం ఆగస్టులో ఖమ్మంలో జరిగిన ఫిజికల్ టెస్ట్, రన్నింగ్‌లో ప్రతిభ చూపి రాష్ట్రంలోనే మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. తదనంతరం జరిగిన వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆర్మీలో ఉద్యోగాలు సాధించి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు సందీప్, మనోజ్‌లు. నాసిక్‌లో చింతల సందీప్ శిక్షణ పొందగా, మనోజ్ బెంగుళూరులో శిక్షణ పూర్తి చేసుకున్నాడు. అనంతరం 2024 జూన్ 20న జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో విధుల్లో చేరారు.

సాయిమనోజ్ ప్రతిభ



మనోజ్ తండ్రి మోహన్, తల్లి జ్యోతి. ఇద్దరూ కూలి పనులు చేస్తూ తమ కొడుకును డిగ్రీ వరకు చదివించారు. మనోజ్ రాష్ట్ర స్థాయిలో జరిగిన అంతర్ జిల్లా అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. 2022 జనవరి 4 నుంచి 7 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో జరిగిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. హైదరాబాద్ గచ్చిబౌలిలో 2022 మే 14, 15 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-20 పురుషుల అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించాడు. 2022 అక్టోబరు 22, 23 తేదీల్లో వరంగల్‌లో జరిగిన 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. వివిధ వయస్సు గ్రూపుల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో నాలుగు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించాడు.

సందీప్‌కు రెండు స్వర్ణాలు



సందీప్ తండ్రి రాజయ్య వ్యవసాయ కూలీ. 2023లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొని 3 వేల మీటర్ల స్ట్రిపుల్ చేజ్‌లో బంగారు పతకాన్ని, 1500 మీటర్ల పరుగులో రజత పతకాన్ని సాధించాడు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో 2023లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ అథ్లెటిక్స్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. 2023 బెంగుళూరులో జరిగిన అఖిల భారత అథ్లెటిక్స్‌లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించాడు. అథ్లెటిక్స్‌లో రెండు బంగారు, రెండు రజత, రెండు కాంస్య పతకాలను సాధించాడు.

రాజన్నను దర్శించుకున్న సినీనటి


గార్లపాటి కల్పలతకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని పుష్ప సినిమా హీరో అల్లు అర్జున్ తల్లి క్యారెక్టర్ చేసిన గార్లపాటి కల్పలత దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి గురువారం విచ్చేసిన ఆమె ముందుగా పార్వతీపరమేశ్వరుల ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

మల్యాల: ఇటీవల విడుదలైన పుష్ప-2లో పుష్పకు తల్లిగా నటించిన గార్లపాటి కల్ప లత గురువారం కొండగట్టు అంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వ దించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహ రనాథ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

ధర్మపురి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు ఆలయంలో గురు వారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.

బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల నిర్మల్ జిల్లాలో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు విశేష ప్రతిభచాటింది. అందులోని పాఠశాల క్రీడాకారులు కె సాయిచరణ్, హాసిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎండి యూనిస్‌పాష తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శ్రీనివాస్, డీఈవో సీహెచ్‌వి జనార్ధన్‌రావు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గేదెల ఎంపికలో అధికారుల ఒత్తిడి

- ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఆవేదన


హరియాణాలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లబ్ధిదారులు

చందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద 2020-21 సంవత్సరంలో ఎంపికైన లబ్ధిదారులు తమకు రెండు నెలల సూడి ఉన్న గేదెలను తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చందుర్తి మండల విలేకరులతో వారు గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద చందుర్తి మండలం నుంచి 10 మంది రెండు గేదెల స్కీములో అర్హత సాధించారు. తమకు అధికారులు గేదెలను ఇప్పిస్తామని ఈనెల 8న హర్యానా రాష్ట్రంలోని రోహతకు జిల్లాలోని ఖురానా డైరీ ఫామ్‌కు ఎనిమిది నెలల సూడి గేదెలను ఇప్పిస్తామని తీసుకువచ్చారన్నారు. డైరీ ఫామ్‌కు వెళ్లిన తర్వాత రెండు నెలల సూడి గేదెలను తీసుకోవాలని తమను అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. రెండు నెలల సూడి గేదెను తీసుకుంటే దాదాపు ఏడు నెలల వరకు గేదెలను పోషించవలసి వస్తుందని, ఆర్థికంగా నష్టపోతామని పేర్కొన్నారు. ఎనిమిది నెలల సూడి గేదెని ఇప్పించడంతో నెలలోనే గేదె దూడకు జన్మనివ్వడంతో పాలు ఇస్తుందన్నారు. డైరీ ఫామ్ వారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులు 8 నెలల సూడిగేదను ఇవ్వడానికి సరిపోవని ఎక్కువ డబ్బులు ఇస్తే ఇస్తామని చెప్పారని లబ్ధిదారులు తెలిపారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తొమ్మిది నెలల సూడిగేదెలను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కాగా లబ్ధిదారులు గురువారం రాత్రి హర్యానా నుంచి జిల్లాకు బయలు దేరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ఇళ్లు లేనివారికి అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుట్లలో 1500, జగిత్యాలలో 6 వేల గుడిసెలు కూల్చిన ప్రభుత్వం గుడిసె ఉన్న ప్రతి ఒక్కరికి 120 గజాల స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానంలో భాగంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని, నిరుద్యోగ యువతీ, యువకులకు చెరుకు రైతులకు ఉపాధి కల్పించాలని అలాగే బీడీ కార్మికులకు 26 రోజుల పని కల్పించాలని, జీవనభృతి రూ.4,016 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గర్వందుల రమేష్, తిరుపతి నాయక్, బుర్ర శేఖర్, మల్యాల సురేష్, వెంకటాచారి, తిరుపతి, కోమటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంపై మోదీ సమాధానం చెప్పాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అదానీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంటకట్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదానీపై అమెరికా చేసిన ఆరోపణలకు ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని, ఈ విషయమై కనీసం పార్లమెంటులో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టినా, బీజేపీ ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తోందని, ఈ మొత్తం వ్యవహారంపై పార్లమెంట్లో చర్చ జరగాలన్నారు. అదానీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్న ఒప్పందాలను ప్రధాని మోదీ బహిర్గతం చేయాలని సూచించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు వచ్చేటట్లు కార్యాచరణ రూపొందించి నిరుపేదలను ఆదుకోవాలన్నారు. ఈనెల 26 నుంచి రాష్ట్రంలో జరిగే సీపీఐ వంద సంవత్సరాల ఉత్సవాలను జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో, ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతున్న దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, కర్షకులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమష్టిగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచి తమ హక్కులు సాధించుకోవాలని, దానికి సీపీఐ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందన్నారు. జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ అనేక ఉద్యమాలకు నిలయంగా సీపీఐ ముందుంటుందని, ప్రభుత్వాలు మారినా బడుగుబలహీన వర్గాలకు పార్టీ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోశిక మోహన్, కార్యవర్గ సభ్యుడు గౌతమ్ గోవర్ధన్, రామగుండం నగర కార్యదర్శి కే కనకరాజ్, కౌన్సిల్ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, ఓదెమ్మ, పెద్దపల్లి పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయకుమార్, మనస్ కుమార్, సూర్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం తదితరులు పాల్గొన్నారు

కోరుట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ జిల్లా స్థాయి సమావేశం సీపీఐ నాయకురాలు ఎన్నం రాధ అధ్యక్షతన జరిగింది. అమరుల స్థూపంతో పాటు వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. 1925 డిసెంబర్ 26వ తేదీన సీపీఐ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. పార్టీ ఆవిర్భావంతో ప్రజా సమస్యలపై పోరాటం చేసి ఎన్నో సమస్యలు పరిష్కార దిశగా నడిచిందని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ప్రజలను చైతన్యం చేసిన పోరాట చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతు భరోసా చెల్లించాలని, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ పెంపు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెన్న సురేష్, చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ఎండి ముక్రం, మనగూరి హన్మంత్, కొక్కుల శాంత, భూమేశ్వర్, ఎద్దండి భూమయ్య, ఎండి ఉస్మాన్, దేవదాస్, కిరణ్, రాంబాబు, వెన్న మహేష్, సమీర్, దశరథం, భూంరెడ్డి, అనంతరాజం, సాండారి మహేశ్, రాజన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపవద్దు

- మెట్‌పల్లిలో వెల్లుల్ల గ్రామస్థుల ధర్నా


మెట్‌పల్లిలో ధర్నా నిర్వహిస్తున్న వెల్లుల్ల గ్రామస్థులు

మెట్‌పల్లి టౌన్/మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంను ఎండో మెంట్‌లో కలుపవద్దని డిమాండ్ చేస్తూ గురువారం వెల్లుల గ్రామస్థులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామం నుంచి మెట్‌పల్లికి ర్యాలీగా బయలుదేరి వచ్చారు. ఎండోమెంట్‌లో నుంచి వెంటనే ఎల్లమ్మ ఆలయంను తీసేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఆలయం నుంచి వస్తున్న ఆదాయంతో పాటు గ్రామస్థులందరం కలిసి ఆలయంను అన్ని విధాల అభివృద్ధి చేశామని అన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అభివృద్ధి చెంది న ఆలయంను ఓ ముగ్గురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎండోమెంట్‌లో కలప డంపై మండిపడ్డారు. అధికారులు స్వాధీనం చేసుకోవడంతో గ్రామస్థులు ఉపాధి కోల్పోతారని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎండోమెంట్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఘటన స్థాలంకు మెట్‌పల్లి సిఐ నిరంజన్‌రెడ్డి, డీఏఓ వసంతలు చేరుకోని గ్రామస్థులను సముదాయించారు. మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ముగిసిన గీతా జయంతి ఉత్సవాలు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో చేపడుతున్న గీతా జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. రాజన్న ఆలయంలో గురువారం ఉదయం అర్చకులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతాలకు అభిషేకము, అర్చనలు చేపట్టారు. అనంతరం చేపట్టిన గీతహోమం కార్యక్రమంలో సంస్కృత పాఠశాల విద్యార్థులు భగవద్గీత పఠనం చేశారు. కార్యక్రమానికి రాజన్న ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా కార్యక్రమం


ఛాత్రోపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య

తిమ్మాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఛాత్రోపాధ్యాయులకు ఈ నెల 9నుంచి నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో డెల్ టెక్నాలజీస్ సహకారంతో ఛాత్రోపాధ్యాయులకు మహిళ సాధికారత, కృత్రిమ మేధస్సు అనే అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ సంజీవులు ఛాత్రోపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారని చెప్పారు. ఛాత్రోపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను, తరగతి గది బోధనలో ఉపయోగించాలని చెప్పారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న 122 మంది ఛాత్రోపాధ్యాయులకు సరిఫికెట్లను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అంబేద్కర్ సంఘ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం


ఇరుకు గదిలో కూర్చున్న చిన్నారులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాలమైన గదులు, ఆటపాటలతో సాగాల్సిన అంగన్‌వాడీ కేంద్రం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ సంఘం భవనంలో కొనసాగుతోంది. ఒకే గదిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సొంత భవనం లేకపోవడంతో ఇరుకుగా ఉన్న సంఘం భవనంలోనే చిన్నారులు, వంట, ఆట వస్తువులు, ప్రభుత్వం సరఫరా చేసే సరుకులను నిల్వ చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచరు పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 17 మంది చిన్నారులు ఉన్నారు. చిన్నారులు విద్యతోపాటు ఆటలు ఆడుకునేందుకు విశాలమైన గదులు లేకపోవడంతో ఇరుకు గదిల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ టీచరు అదే గదిలో ఓ సిలిండర్‌ను ఏర్పాటు చేసుకుని కోడిగుడ్లను ఉడకపెట్టడం, భోజనం తయారుచేస్తున్నారు. తన ఇంటి నుంచి వండిన కూరలను తీసుకొచ్చి వడ్డిస్తున్నారు. తాగు నీటి సౌకర్యం లేక దూర ప్రాంతం నుంచి నీటిని తీసుకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అంబేద్కర్ సంఘ భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

న్యూస్ బాక్స్

ఉచిత వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్యుడు శ్రీనివాస్, హెడ్ గుర్రం కిరణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కౌటం సతీష్, లక్ష్మారెడ్డి, కొమురయ్య, కోట కరుణాకర్, హరీష్, యూనిస్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

కమాన్‌పూర్,డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష జరిగింది. గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆయా పార్టీల నాయకులు హాజరయ్యారు. ఎంపీడీవో లలిత మాట్లాడుతూ మండలంలో పోలింగ్ స్టేషన్ వివరాలు, ఓటరు జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులో పెట్టడం జరుగుతుందని, అభ్యంతరాలుంటే 17వ తేదీలోపు తెలపాలన్నారు. సమావేశంలో మండల శాఖాధ్యక్షుడు వైనాల రాజు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటి కొండ శంకర్, బీజేపీ మండలాధ్యక్షుడు జంగిపల్లి అజయ్, మచ్చగిరి రాము, బీఎస్పీ నాయకులు పులిపాక బొంద్యాలు, వంశీ ఉన్నారు.

ఏసుక్రీస్తు జన్మ పవిత్రమైంది

మంథని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాప ప్రక్షాళనతో మానవులను రక్షించడానికి భూలోకాని వచ్చిన ఏసుక్రీస్తు జన్మ పవిత్రమైందని ఐఎంఐ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో గురువారం జరిగిన మంథని ఫీల్డ్‌పాస్టర్ల సహవాస కూడికలో ఆయన మాట్లాడుతూ..కన్య గర్భంలో ఏసుక్రీస్తు జన్మించి తన పవిత్రతను చాటుకున్నాడన్నారు. ఈసందర్భంగా క్రిస్మస్ కేక్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఈసీ కోశాధికారి వల్లూరి ప్రభాకర్, ఫీల్డ్ పెద్దలు మార్కు, ఆదాము, పాస్టర్లు మహేష్, సామ్యూల్, రాజేష్, కోటేష్, చందు ఉన్నారు.

పందుల పెంపకందారుడికి నోటీసులు జారీ

ముత్తారం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రంలోని రెండవ వార్డ్ లో పందులు స్వైరవిహారం చేస్తూ జనావాసాల పరిసర ప్రాంతాలను అపరిశుభ్రం చేస్తూ పసి పిల్లలపై దాడులకు యత్నిస్తుండటంతో స్థానిక ప్రజలు ముత్తారం గ్రామపంచాయతీ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సెక్రెటరీ విచారణ చేయగా రెండవ వార్డు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న పందులు అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కేతిరి సదానందం, భూమేష్‌లకు చెందినవిగా తేలింది. అడవిశ్రీరాంపూర్ గ్రామపంచాయతీ సెక్రెటరీని సంప్రదించి కేతిరి సదానందం, భూమేష్‌లకు నోటీసులు జారీ చేస్తూ పందుల పెంపకం జనావాసాలకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ఇకపై పందుల వలన గ్రామాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మన్‌గా శ్రీనివాస్

ధర్మారం, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల చైర్మన్‌గా ధర్మారానికి చెందిన మామిడిశెట్టి శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయకుమార్ తెలిపారు. జూనియర్ కాలేజిలో ఒకేషనల్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఆయనను నియమించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో మండల చైర్మెన్‌గా నియమించినందుకు ఈ సందర్భంగా కొప్పుల విజయ్ కుమార్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలపారు. ధర్మారం మండల వ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగకుండా తనవంతు కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు



ఖోఖో పోటీల బాలికల విజేత జట్టు

జ్యోతినగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్‌లో భాగంగా గురువారం ఎన్టీపీసీ టీటీఎస్ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఓపెన్ కేటగిరిలో కబడ్డీ, కోకో పోటీలు, అండర్ 18 విభాగంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటీలలో రామగుండం మండలం, అర్బన్ నుంచి పలు జట్లు పాల్గొన్నాయి. పురుషుల కబడ్డీలో తిలక్‌నగర్ జట్టు విజేతగా నిలవగా, కాకతీయ జూనియర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కోకోలో గోదావరిఖని ప్రభుత్వ పాఠశాల జట్టు ప్రథమ స్థానం, ఎంజేపి రామగుండం జట్టు రెండో స్థానంలో నిలిచాయి. కబడ్డీ బాలికల విభాగంలో ఎంజేపీ రామగుండం జట్టు మొదటి స్థానం, రామగుండం జెడ్పీహెచ్ఎస్ రెండవ స్థానం సాధించాయి. కోకోలో ఎన్టీపీసీ జెడ్పీహెచ్ఎస్ ప్రథమ స్థానం, జీడీకే ప్రభుత్వ పాఠశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎన్టీపీసీ జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు గొర్రె జయరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ మండలస్థాయి ఎంపిక క్రీడా పోటీలను గురువారం ఎంపీడీవో పద్మజ, ఎంఈవో సరస్వతి, ఎంపీవో అనిల్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు మెమెంటోలు, బహుమతులను అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : క్రీడల పోటీల్లో సమన్వయంతో క్రీడాస్ఫూర్తిని చాటాలని ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ యాకయ్య కోరారు. మండలంలోని కనగర్తి దాసరి పద్మ-హనుమయ్య హై స్కూల్‌లో గురువారం సీఎం కప్ క్రీడాపోటీలను తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడ పోటీల్లో ఎలాంటి వివాదాలు లేకుండా సంయమనంతో పోటీలను ఎదుర్కోవాలని తెలిపారు. ఈ టోర్నీ ద్వారా ఏకాగ్రత, మిత్రుత్వం పెంపొందించడమే కాకుండా విద్యార్థుల్లో దృఢత్వాన్ని పెంపొందిస్తుందని అన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో క్రీడ పోటీలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఇంచార్జి ఎంఈవోతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీలలో గర్రెపల్లి జట్టు విజేతగా నిలిచింది. వాలీబాల్ అండర్ 17 విభాగంలో విద్యార్థులు అత్యంత ప్రతిభను చాటుకుని ప్రథమ స్థానంలో నిలిచి కప్ గెలుచుకున్నారు. అలాగే వాలీబాల్ అండర్ 12విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. కబడ్డీ అండర్ 17 విభాగంలో కూడా గర్రెపల్లి జట్టు ద్వితీయ స్థానం పొంది బహుమతులను గెలుచుకున్నారు. వీరికి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారులు గెల్లు మధుకర్, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ ప్రణయ్ పీఈటీలు ఆసియా బేగం, సత్యం అజ్జు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పాలకుర్తి డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) :ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏవో బండి ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన కుక్కలగూడూర్, పుట్నూర్‌లోని ఫర్టిలైజర్ షాపులతో పాటు డీసీఎంఎస్ సొసైటీ రికార్డులను పరిశీలించారు.

ఆటోల బంద్

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆటోలపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తుండటంతో గురువారం ఆటోడ్రైవర్‌లు బంద్ నిర్వహించారు. ఫిర్యాదులకు నిరసనగా ఆటోలను బంద్ పాటిస్తున్నట్లు ఆటో డ్రైవర్‌లు పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసనలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్యాల గ్రామపరిధిలో గల మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు.

కామన్ డైట్ లాంచ్ కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : కామన్ డైట్ లాంచ్ కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ మెనూ కార్యక్రమం లంచ్ ఉంటుందని, విద్యార్థులకు కామన్ డైట్ ప్లాన్ అమలులోకి వస్తుందని అన్నారు. కామన్ డైట్ ప్లాన్‌పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి లాంచ్ కార్యక్రమం చేయాలని కలెక్టర్ సూచించారు. వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, ప్రతి హాస్టల్‌లో ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందిస్తారన్నారు. కిచెన్ డైనింగ్ ఏరియా నిర్వహణ మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కామన్ డైట్ ప్లాన్ సంబంధించిన బ్యానర్ ముఖ్యఅతిథితో ఆవిష్కరించి ప్రసంగిస్తారని కలెక్టర్ తెలిపారు. శనివారం కామన్ డైట్ లాంచ్ కార్యక్రమం ఉన్నందున నాన్‌వెజ్ ఆదివారం మెనూ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జే రంగారెడ్డి, డీఈవో మాధవి పాల్గొన్నారు.

ఎన్టీపీసీ శ్వేత పత్రం విడుదల చేయాలి

జ్యోతినగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభావిత ప్రాంతాలలో ఏం అభివృద్ధి చేస్తారో, ఎన్ని నిధులు కేటాయిస్తారనే విషయంలో ఎన్టీపీసీ శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ ఏరియా అధ్యక్షుడు ఆసీఫ్ పాషా, ప్రభావిత ప్రాంతాల పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధిపై ఎన్టీపీసీ స్పష్టత ఇచ్చిన తరువాతనే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. తెలంగాణ ఎస్టీపీపీ ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, ప్రభావిత కాలనీలు, గ్రామాల అభివృద్ధి, ప్రజలే సంక్షేమంపై ఎన్టీపీసీ వైఖరిని తాము ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల చేతకానితనం వల్ల ఎన్టీపీసీ చుట్టు పక్కల ప్రాంతాలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ఆ నిరక్ష్యాన్ని సహించదన్నారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ ప్లాంటు రావడానికి స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మంత్రి శ్రీధర్ బాబుల కృషి కారణమన్నారు. అయితే 29వేల కోట్ల రూపాయలతో నిర్మించనున్న టీఎస్‌టీపీపీ స్టేజ్ 2కు సంబంధించి నిబంధనల ప్రకారం ఆ పెట్టుబడిలో కొంత శాతాన్ని చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి కేటాయించాలని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో అన్ని మౌళిక వసతులను కల్పించాల్సిన బాధ్యత ఎన్టీపీసీపై ఉందన్నారు. ప్రాజెక్టు వల్ల ఏర్పడే కాలుష్యాన్ని భరించేది ఈ ప్రాంత ప్రజలేనని, ఆ ప్రజల మేలు కోసం ఎన్టీపీసీ నిధులు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులో శాశ్వత ఉద్యోగాలతోపాటు కాంట్రాక్టు కార్మికుల పోస్టులను స్థానికులకే ఇవ్వాలని, ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కోసం ఉచిత విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ విషయంలో ఈనెల 19లోగా ఎన్టీపీసీ యాజమాన్యం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలన్నారు. లేకపోతే 19న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో నిలదీస్తామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో డివిజన్ల అధ్యక్షులు మడిపల్లి మల్లేష్, భరత్‌గౌడ్, కొలని వెంకటరెడ్డి, ఈదునూరి రవి, హరిప్రసాద్, మల్లేశ్, రవి, తూం పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు

మంథని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక దత్తాత్రేయ స్వామి, అయ్యప్పస్వామి ఆలయాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ప్రత్యేక పూజల నిర్వహించారు. వేర్వేరుగా ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకొని పూజలు చేసి వేద పండితుల ద్వారా ఆశీర్వాదం తీసుకున్నారు. మండలంలోని సూరయ్యపల్లిలో బుధవారంరాత్రి తన పీఏ ఆకుల చంద్రశేఖర్ ఇంట్లో జరిగిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తామన్నారు. ఆయన వెంటన కాంగ్రెస్ పార్టీ నేతలు, భక్తులు ఉన్నారు.

17న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 17న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్‌లో 20 ఫార్మసిస్ట్ 30, కస్టమ్ సేల్స్ అసోసియేట్, 50 జూనియర్ అసిస్టెంట్, 15 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీఉన్నాయని, సేల్స్ ఫార్మసిస్ట్ పోస్టులకు డిప్లొమా/డిగ్రీ ఇన్ ఫార్మసీ, జూనియర్ అసి స్టెంట్, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ అసిస్టెంట్లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9392310323, 8985336947, 8121262441 సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వణికిస్తున్న చలి..

(5వ పేజీ తరువాయి)

అలాగే జిల్లా కేంద్రంలోనూ కొద్దిరోజులుగా చలి పెరగడంతో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. పెద్దపల్లి పట్టణంలో ఉన్ని దుస్తుల వ్యాపారం చేసేందుకు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు ఏటా ఇక్కడికి వస్తుంటారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలో వీరు వ్యాపారం చేస్తుంటారు. నవంబరులో ఇక్కడి వచ్చి జనవరి నెలాఖరులో తిరిగివెళ్లిపోతారు. స్వెట్టర్లు, గ్లౌజులు, జర్కిన్లు, బ్లాంకెట్లు మంకీ క్యాప్‌లాంటి చలిని తట్టుకునే దుస్తులు విక్రయిస్తారు. పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన వారు ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తుంటారు.

గత ఏడాది కంటే ఎక్కువగా ఉంది..



రమేష్, ఆటో డ్రైవర్, గోదావరిఖని

గత ఏడాది డిసెంబర్‌లోకంటే ఈ ఏడాది చలి ప్రభావం ఎక్కువగా ఉంది. ఉదయం ఆటో నడపాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాత్రి రోడ్లపై కూడా జన సంచారం కూడా ఉంది. రాత్రి 7గంటలు అయితే రోడ్లు నిర్మానుశ్యంగా మారుతున్నాయి. తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

పెరిగిన వ్యాపారం..



డౌస్, ఉన్ని దుస్తుల వ్యాపారి, గోదావరిఖని

గతంలో కంటే ఈ ఏడాది చలి పెరిగింది. దీంతో గత పది రోజులుగా ఉన్ని దుస్తులు కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వ్యాపారం బాగా సాగుతుంది. ఉన్ని దుస్తుల కోసం వినియోగదారులు మా షాపులకు ఎక్కువగా వస్తున్నారు.

వ్యవసాయం చేస్తుంటాం..



కేశురాం, మధ్రప్రదేశ్

మా రాష్ట్రంలో ఇక్కడికి వచ్చే అందరం వ్యవసాయం చేసుకుంటాం. సీతాకాలం ప్రారంభం కాగానే ఉన్ని దుస్తులను హరియానా రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి ఇక్కడికి వచ్చి అమ్ముకుంటాం. ఈసారి తుఫాన్ కారణంగా గిరాకీలు తగ్గిపోయాయి. ఇప్పుడిప్పుడే వ్యాపారం నడుస్తోంది.

వేరే వ్యాపారం తెలియదు..



- ప్రకాష్, మధ్రప్రదేశ్

నేను నా తమ్ముడు ఇద్దరం కలిసి వచ్చాం. ఇక్కడే వండుకొని తింటూ ఉన్ని దుస్తులు అమ్ముకుంటాం. మాకు వేరే వ్యాపారం తెలియదు. నా భార్యపిల్లలు మా ఊరిలో వ్యవసాయ కూలీలుగా పని చేస్తుంటారు.

పోలీస్ స్టేషన్ కోసం భవన పరిశీలన

ఎలిగేడు, డిసెంబర్ 12, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం పోలీస్ స్టేషన్ ఏర్పాటుకోసం సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారెడ్డి భవనాలను పరిశీలించారు. మండల కేంద్రంలో గతంలో నిర్వహించిన తహసీల్దార్, బాలుర బీసీ హాస్టల్ భవనాల్లో ఏది అనుకూలంగా ఉంటుందో చూశారు. వెంట జూలపల్లి ఇంచార్జీ ఎస్సై నరేష్ ఉన్నారు.

నేడు సీఎం కప్ క్రీడా పోటీలు

ఎలిగేడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నిర్వహించనున్న సీఎం కప్ ఎలిగేడు మండలస్థాయి క్రీడలు ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 13న ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. కబడ్డీ, ఖోఖో వాలీబాల్ మండల స్థాయిలో నిర్వహించునున్నారు. ఆధార్‌కార్డు వెంట తీసుకరావాలన్నారు.

నారుమడులను పరిశీలించిన శాస్త్రవేత్తలు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గత కొద్దిరోజులుగా చలి తీవ్రత పెరుగుతున్న కారణంగా వరి నారుమడులు ఎర్రబడడం కారణంగా రైతుల్లో ఆందోళన ఉందని యాజమాన్య సూచనలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం వరి నారుమడులను సందర్శించారు. వరి నారుమడులలో చలి తీవ్రతతో పాటు వివిధ పోషక లోపాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి సంబంధించిన నివారణ చర్యలను రైతులకు పలు సూచనలు చేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ

మంథని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఏటా సంభవించే ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలు అవగాహన పెంచుకొని జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టాల నుంచి కాపాడుకోవచ్చునని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక లైన్‌గడ్డ ఏరియాలో ఎన్‌డీఆర్ఎఫ్ ఉద్యోగులు గురువారం కమ్యూనిటీ అవేర్‌నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్‌డీఆర్ఎఫ్ అవగాహన కల్పించిన పలు అంశాలను ప్రజలు జాగ్రత్తగా విని విపత్కర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవాలని, ఇతరులకు సహాయం చేసే విధంగా ఉండాలని కోరారు. వరదలు, భూకంపాలు, పాము, తేలు కాటు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తపై ఉద్యోగులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, తహసీల్దార్ రాజయ్య, వైస్‌చైర్మన్ బానయ్య, కమీషనర్ మనోహర్, ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కొందరి అమాయకత్వం వల్ల ఆన్‌లైన్ మోసాల ద్వారా డబ్బులు పోగొట్టుకుంటున్నారని వీటిపై అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ ఇన్‌చార్జి మల్లన్న, మెంబర్ స్నేహలత అన్నారు. మండలంలోని గర్రెపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణలో షీ టీమ్ బృందం విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాల పట్ల, మహిళల భద్రత పట్ల, ఆంటీ డ్రగ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థినిలను మహిళలను ఎవరైనా వేధిస్తే 603923700 సెల్‌కు సమాచారం అందించి పోలీసులను ఆశ్రయించి తగిన రక్షణ, భద్రత పొందాలని సూచించారు. అలాగే ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు కవిత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవోల(న్యాయనిర్ణేతలు) బృందం

జ్యోతినగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ టీటీఎస్ జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ రెండో రోజు గురువారం కొనసాగింది. వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్ పర్యావరణం, వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్ తదితర వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన నమూనాలను చూసేందుకు పారిశ్రామిక ప్రాంతంలోని పాటశాలల విద్యార్థులు ఇక్కడికి తరలివచ్చారు. రెండో రోజు విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు, ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ప్రదర్శించిన మోడళ్లను జిల్లాలోని ఎంఈవోలతో కూడిన న్యాయ నిర్ణేతలు పరిశీలించారు. చివరి రోజు శుక్రవారం మధ్యాహ్నం ఉత్తమ నమూనాలు, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన నమూనాలను ప్రకటిస్తామని జిల్లా సైన్స్ అధికారి రవినందర్‌రావు తెలిపారు.



ఓసీపీ-1లో భద్రతా కమిటీ తనిఖీ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భద్రతా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ఓసీపీ-1 ప్రాజెక్టును భద్రతా పక్షోత్సవ బృందం తనిఖీ చేసింది. జీఎం ఎక్స్‌ప్లోరేషన్, దేబులాల్ బైద్య బృందం ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో సీపీపీ, ఎస్‌వోపీల ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యోగులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడంపై ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని, ప్రమాదరహిత ప్రాజెక్టుగా ఓసీపీ-1ను నిలపాలని బైద్య ఉద్యోగులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, పీఓ రాజశేఖర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డితో పాటు తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి

రామగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధికి బాటపడిందని ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం సెంటినరీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజాప్రభుత్వంలో అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. రైతులకు రుణమాఫీ, గృహలక్ష్మి పథకంలో 2వందల యూనిట్‌ల ఉచితం విద్యుత్, మహిళలకు ఉచిత బసు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల ఆరోగ్య బీమాను కల్పిస్తుందన్నారు. వీటితో పాటుగా కార్మికుల హక్కులను ఒక్కొక్కటిగా వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్‌ల నేతృత్వంలో పరిష్కరిస్తున్నాట్లు పేర్కొన్నారు. కార్మికులకు రూ.796 కోట్లు లాభాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా ఐఎన్‌టీయూసీ ముందువరుసలో ఉంటుందన్నారు. కాలనీలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. పోతన కాలనీ నుంచి సెంటినరీకాలనీకి అడిషనల్‌గా రూ.9 కోట్లతో పైప్‌లైన్ వేయడం జరుగుతుందన్నారు. ఏఎల్‌పీలో పనిచేసే 150 మంది జనరల్ మజ్దూర్లను ఆర్జీ-3 ఏరియాకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గడ్డం తిరుపతి యాదవ్, మద్దిరాజు శ్రీనివాసరావు, నారాయణ, వెంకటస్వామి, మనోహర్, సదానందం, కొలానికల్, వెంకటేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

వకీల్‌పల్లి గనిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం



కార్మికుడికి బహుమతి అందజేస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలోని వకీల్‌పల్లె గనిలో గురువారం మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ పర్యటించింది. గని ఉత్పత్తి, రానున్న ఆర్థికసంవత్సర వార్షిక లక్ష్యసాధన, యంత్రాల వినియోగం, భవిష్యత్తు ప్రణాళికలు వంటి అంశాలను కార్మిక సంఘాల నాయకులు కార్మికులతో కమిటీ సభ్యులు చర్చించారు. ఉత్పత్తి పెంపుదల, రక్షణ అంశాలపై ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో జీఎం వెంటయ్య, ఏఐటీయూసీ బ్రాంచిసెక్రెటరీ రవీందర్, మల్టీడిపార్ట్ సభ్యులు నరసింహారావు, రాముడు, అనిల్‌కుమార్, మురళీ కృష్ణ, తిరుపతిరెడ్డి, గని పీవో నెహ్రూ, మేనేజర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే లక్ష్యాలను చేరుకోవాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. గురువారం సింగరేణి సంస్థ డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో నిర్వహించిన మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలను అనుసరిస్తూ అంకితబావంతో సమష్టి కృషితోనే లక్ష్యాలను చేరుకోగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో అధికారులు వెంకటరమణ, రఘుపతి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, సుదర్శనం, చంద్రశేఖర్, రామారావు, మనోహర్, ఎల్లయ్య, కార్మిక సంఘాల నాయకులు రామచంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో దివ్యాంగులకు ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులతో అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-2 వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు ఆటల పోటీలు జరిగాయి. సీఈఆర్ క్లబ్‌లో జరిగిన ఈపోటీలకు పలువురు దివ్యాంగులు హాజరయ్యారు. ఆర్జీ-2 జీఎం వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపేలా మెలగడం మనందరి బాధ్యతని జీఎం పేర్కొన్నారు. అన్ని రకాల అంశాల్లో నైపుణ్యత పెంపొందించడం, వారిలో దాగి ఉన్న గ్రహణ శక్తి, ఆసక్తి ఉన్న అంశంలో రాణించేలా దివ్యాంగులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని జీఎం వెంకటయ్య అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో పాల్గొన్న వారికి అధికారులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు వేణుగోపాల్, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, మనోచైతన్య నిర్వాహకుడు కృష్ణప్రసాద్‌లు పాల్గొన్నారు.

వందే భారత్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి : ఎంపీ



రైల్వే మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

మందమర్రి టౌన్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలతోపాటు వందే భారత్ రైలు హాల్టింగ్ ఇవ్వాలని గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ వినతిపత్రం అందజేశారు. మంత్రి దృష్టికి రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాంతం నుంచి ప్రయాణికుల నుంచి ఆదాయం వస్తోందని, ఈ స్టేషన్లలో హాల్టింగ్ ఇవ్వాలన్నారు. ఈ రైల్వే స్టేషన్‌లను ఆధునికీకరించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించలని కోరారు. ఈవిషయాలపై రైల్వే శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

వర్గీకరణ అమలు చేయాలి..

సుల్తానాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి సీఎం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు గుండ థామస్‌మాదిగ డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ ఐబీ ఆవరణలో గురువారం ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో థామస్ మాట్లాడుతూ డబ్బుతో రాజకీయాలను ముడిపెడుతూ మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. కొద్ది రోజుల్లో సుల్తానాబాద్‌లో మంద కృష్ణ మాదిగ పాల్గొనే విధంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు పూర్తి

ఎలిగేడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సమగ్రసర్వే చేపట్టాలని గత నెల9న ఆదేశాలు జారీచేసింది. 25 రోజులపాటు 49మంది ఎన్యూమరేటర్లు, నలుగురు సూపర్‌వైజర్‌లతో సర్వే కొనసాగింది. సర్వే వివరాలను ఆన్‌లైన్ ఉద్యోగులు, సిబ్బంది కలిసి కంప్యూటరీకరణ పూర్తిచేసినట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో ఆరీఫ్‌లు గురువారం తెలిపారు. మండలంలో 12గ్రామ పంచాయతీలలో 7618ల గృహాలు ఉన్నట్లు సర్వే అధికారులు తేల్చారు. వివిధ గ్రామాల్లోని వార్డులలో సర్వే చేస్తున్నప్పుడు దొర్లిన తప్పులను సరిచేసే క్రమంలో కొంత జాప్యం జరిగినా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిచేశామన్నారు.